www.prajasakti.com

ప్రజాశక్తి


మంగళవారం 29 జులై 2025

5

ఏలూరు



బకాయిలివ్వాలని కోరుతూ ఉపాధి కూలీల ఆందోళన


వినతి అందిస్తున్న వ్యకాస నేతలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధి హామీ కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద వద్ద సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, రెండుసార్లు ఫొటో విధానాన్ని రద్దు చేయాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని నినదించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.జహంగీర్ భాషా, బి.మోహనరావు, టి.అర్జునరావు, ఎం.బాలయ్య, మరియమ్మ, సుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు భూమి దక్కే వరకూ పోరు ఆగదు

ఎర్రకాలువ మిగులు భూములను పేదలకిచ్చి ఏక్ సాల్ పట్టాలివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

మిగులు భూముల్లో దుక్కి దున్ని, నాట్లు వేసిన నేతలు, పేదలు


భూముల్లోకి వెళ్లిన సందర్భంగా మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం

ప్రభుత్వ భూములపై భూమి లేని నిరుపేదలకు చట్టప్రకారం పూర్తి హక్కు ఉందని, ఆ భూములు పేదలకు దక్కేంత వరకు భూపోరాటం ఆగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జంగారెడ్డిగూడెం ఎర్రకాల్వ రిజర్వు ప్రాజెక్టు పరిధిలో మిగులు భూములను జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల భూపోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో పేదలు సాగు చేస్తున్న భూములను సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగలితో దుక్కి దున్ని వరినాట్లు వేసి సాగు పనులు ప్రారంభించారు. ఆ భూముల్లో ఎర్రజెండా పాతి పోరాట స్ఫూర్తి నింపారు. అనంతరం ముదినేపల్లి భూపోరాటంలో అమరులైన ఏడుగురికి ఘననివాళి అర్పించారు. తొలుత జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఇతర నాయకులకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎ.పోలవరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మిగులు భూముల సమీపంలో శ్రీనివాసరావుకు మహిళలు బొట్టు పెట్టి, శాలువా కప్పి ఆహ్వానం పలికారు. అక్కడ నుంచి పాదయాత్రగా పొలాల్లోకి చేరుకుని సాగు చేస్తున్న పేదలను భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటిలో మునగకుండా ఉన్న ఎర్రకాలువ మిగులు భూములు మూడు వేల ఎకరాలను భూస్వాముల వద్ద నుండి ఇరిగేషన్ అధికారులు స్వాధీనం చేసుకుని పేదలకు ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారం పొందిన భూస్వాములే వాటిని అనుభవించడం తగదన్నారు. ఆ భూములపై పేదలు తమకు హక్కు ఉందని, మేము సాగు చేసుకుంటామని సాగు చేపట్టారని, అప్పటి వరకు మొద్దు నిద్రలో ఉన్న అధికారులు సాగు చేయడానికి వీల్లేదని పేదలను వేధించి, నిర్బంధకాండ సాగిస్తూ అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. పేదల మీటింగ్ పెడితే పోలీసులు డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్నారని, పోలీసులు పరిశీలించాల్సింది పేదలు, రైతులు, కమ్యూనిస్టు నాయకులను కాదని, ప్రజల సొత్తును బకాసురులుగా మేస్తున్న భూస్వాములను అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన ఏఒక్క భూస్వామిపైనైనా కేసులు పెట్టారా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు భూస్వాములు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయన్నారు.


ర్యాలీగా వెళ్తున్న పేదలు, నేతలు


శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న పేదలు

టి.నరసాపురం మండలంలో మహిళలు, గర్భిణులని చూడకుండా వ్యవసాయ కార్మికులపై ఇష్టానుసారంగా కేసులు పెట్టారని, ఇరిగేషన్ భూములన్నీ ప్రభుత్వ భూములు పందికొక్కుల్లా మేస్తుంటే ఆ శాఖ ఏం చేస్తుందని ప్రశ్నించారు. పేదలకు నోటీసులు ఎలా ఇస్తారని, కేసులు ఎలా పెడతారని, మీకు ఆ అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. చట్టప్రకారం ప్రభుత్వ భూములను అనుభవించే హక్కు భూమిలేని పేదలకు, వ్యవసాయ కూలీలకు ఉందన్నారు. ఇది ప్రభుత్వ చట్టం అవునో, కాదో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. పేదలను వేధిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పేదలకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలని, పేదల సాగుకు అనుమతించాలని అన్నారు. దిగువలోతట్టు ప్రాంతాలు కాబట్టి ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని చట్టాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. భూములు తీసుకుని పరిశ్రమలు పెట్టని పారిశ్రామికవేత్తలపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు. డబ్బులు పోస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. పేదలకు ఉపాధి హామీని దూరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ ఎర్రకాలువ మిగులు భూములు ప్రభుత్వ భూములేనన్నారు. 2007లో ముదినేపల్లిలో భూపోరాటంలో పోరాటం జరిగితే ఏడుగురు చనిపోయారన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సు మేరకు ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, భూములు సాధించుకునే వరకు పోరాటం ఆపొద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎం.నాగమణి, ఎ.తీవర్తం, గుడెల్లి వెంకట్రావు, రామకృష్ణ, దుర్గారావు, పి.సూర్యారావు, ఎ.ఫ్రాన్సిస్, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, ఎం.సుధారాణి, తామా ముత్యాలమ్మ, ఎ.సీత, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్, జె.సూర్యచంద్రం, బి.వెంకటేష్, ఎం.కుమారి, బి.గంగాభవాని, ఎం.శిరీష, కె.దుర్గ, మురళి, కార్యకర్తలు, పేదలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి: కలెక్టర్ కె.వెట్రిసెల్వి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యమూ వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగంగా పరిష్కరిస్తేనే ప్రభుత్వ అధికారులపై ప్రజలకు విశ్వాసం కలుగుతుందని, వారి మన్ననలు కూడా పొందవచ్చని అన్నారు. పోలీస్ శాఖకు సంబంధించి అందిన అర్జీలను చట్టపరిధిలో తగు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జెసి పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ పాల్గొన్నారు.

ఇల్లు లేనివారు ఉండకూడదనేదే సిఎం లక్ష్యం

రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి


మంత్రికి వినతి అందిస్తున్న పేదలు

ప్రజాశక్తి - మండవల్లి, కైకలూరు

ఇల్లు లేని నిరుపేదలు రాష్ట్రంలో ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందడుగు వేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. సోమవారం లోకుమూడి సిఎన్ఆర్ గార్డెన్లో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలో కైకలూరు గ్రీన్ విలేజ్, మండవల్లి, కలిదిండి మండలాల్లోని గృహ నిర్మాణాలు, ఇళ్ల స్థలాల మెరక తదితర సమస్యలపై అధికారులు, నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో అర్హులైన ప్రతి పేదవానికీ పక్కాఇల్లు నిర్మించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అయితే గత ప్రభుత్వం సెంటున్నర స్థలాన్ని మాత్రమే కేటాయించిందని, దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున స్థలాన్ని మంజూరు చేయడంతోపాటు రూ.2.50 లక్షల నిధులు మంజూరు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో పేదల ఇళ్ల స్థలాల మెరక కోసం రూ.ఐదు కోట్లు కేటాయించాలని ఎంఎల్ఎ శ్రీనివాస్ కోరారని తెలిపారు. ఆ నిధులు జనవరిలోపు మంజూరు చేసి లబ్ధిదారులంతా పూర్తిస్థాయిలో ఇళ్లు నిర్మించుకునేలా చేస్తామన్నారు. రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి నాయకులే ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో డాగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఎమ్‌డి ఎం.శివప్రసాద్, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, గృహనిర్మాణ శాఖ పీడీ జివివి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ కెవి.సుబ్బారావు, డిపిఒ అనురాధ, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జి.త్రినాధబాబు, పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి పీడీ కె.శ్రీనివాస్, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, నేతలు పాల్గొన్నారు.

ఒరిజినల్ పట్టాలు ఇప్పించండి

తమకు ఒరిజినల్ పట్టాలను పంపిణీ చేసి, స్థలాలను మెరక చేసి ఇళ్లు నిర్మించాలని కోరుతూ మండవల్లి తరుగుమూల ఇళ్ల స్థలాల లబ్ధిదారులు మంత్రి పార్థసారధికి వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

స్మార్ట్ మీటర్లను బిగించొద్దని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని నిలిపి వేయాలని సిపిఎం జిల్లా కేంద్ర శాఖ ఆధ్వర్యాన సోమవారం స్థానిక పత్తేబాద వద్ద డీమార్ట్ సెంటర్లో నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం పత్తేబాద్‌లోని 30వ డివిజన్‌లోని సచివాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అదానీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తూ ప్రజల నుండి అధికంగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు, పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఐదో తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎస్.సత్యనారాయణ, ఎ.శ్యామలారాణి, పి.ఆదిశేషు పాల్గొన్నారు.


ఏలూరులో

చింతలపూడి: విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని కోరుతూ స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పాండురంగారావు, తొర్లపాటి బాబు మాట్లాడగా, కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు సర్వేశ్వరరావు, సిపిఎం నాయకులు ఆర్‌వి.సత్యనారాయణ, ప్రజాసంఘాల నేతలు డి.సత్యనారాయణ, పి.జోషి, కంచర్ల గురవయ్య, దొంతా కృష్ణ, ఎస్‌కె.కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, మార్తా లక్ష్మణరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు పట్టణ కార్యదర్శి పసల సూర్యారావు, ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచే వసంతరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు సరియం రామ్మోహన్ మాట్లాడారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లు రద్దు చేసి, ట్రూఅప్ ఛార్జీలు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు కెవి.రమణ, జంపన రమణరాజు, మాబూ సుభాని, వంగా గోపి, సుంకర రాధాకృష్ణ, జి.బాలయేసు, చందా త్రిమూర్తులు, చింతల రాజు, ఆంజనేయరాజు, బేతి కిషోర్, తాళ్లూరి నాగరాజు, మంచర్ల ప్రభాకర్‌రావు, హనుమంతు, మొల్లేటి శ్రీను పాల్గొన్నారు.


చింతలపూడిలో..

ఆగిరిపల్లి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన నెక్కలం గొల్లగూడెం సబ్‌స్టేషన్ వద్ద సోమవారం నాడు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ప్రజాధనాన్ని అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడమే ధ్యేయంగా కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు పని చేస్తున్నాయరన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను రద్దుచేయటంతోపాటు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని, ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌స్టేషన్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజులపాటి చంటి, ముత్యాల నరేష్, ఏపూరి రవీంద్ర, సామియేలు, రాధాకృష్ణ, నవీన్, సుందరం, శివమోహన్ పాల్గొన్నారు.

ఇకపై కొత్త భవనంలో వైద్య సేవలు

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి

నూజివీడు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలోని నూతన భవనంలో ఇక నుంచి వైద్య సేవలు అందించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి తెలిపారు. ఆమె సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలకు చెందిన వైద్యులు, మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇకపై నూజివీడు పరిసర ప్రాంత ప్రజలు ఎలాంటి వైద్య సేవలనైన నూతన భవనంలో పొందవచ్చన్నారు. బ్లడ్‌బ్యాంక్ అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. ఎలాంటి అత్యవసర వైద్య సేవలైనా ఆసుపత్రి ద్వారా అందించేందుకు వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు చాలాచోట్ల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, వాటికి వెంటనే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, వీలు పడని చోట్ల కొత్త రోడ్లు వేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు నుండి పెదపాడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని పేర్కొన్నారు. అలాగే చింతలపూడి నుండి టి.నర్సాపురం, జీలుగుమిల్లి నుండి మక్కినవారిగూడెం వెళ్లే రోడ్లు దారుణంగా మారాయని తెలిపారు. ఈ మార్గాల్లో గోతుల్లో వర్షపు నీరు నిండి ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం సంక్రాంతికి గోతులు లేని రోడ్లు నిర్మిస్తామని, తర్వాత పూర్తిస్థాయిలో రోడ్లు వేస్తామని చెప్పిన మాటలు కేవలం కొన్ని రోడ్లకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. చాలారోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆయన విమర్శించారు. రోడ్ల నిర్మాణం ఎంఎల్‌ఎల బాధ్యతని, దానికి వారే జవాబుదారీ అని చెప్పిన ముఖ్యమంత్రి నేడు ఏఒక్క ఎంఎల్ఎ కూడా ఈ విషయంలో పట్టించుకోకపోతే ప్రజలు ఎవరిని అడగాలని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా ఏలూరు జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఏలూరు నుండి పెదపాడుకు వెళ్లే రోడ్లు పరిస్థితి మరీ అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. ఈ మార్గంలో గోతులు ఎక్కువగా ఉండటంతో ఇటీవల ప్రమాదాలు జరిగాయని, మధ్యలో కేన్సర్ ఆసుపత్రి ఉండడంతో ఎక్కువ మంది రోగులు వచ్చి వెళుతుంటారని, అయినా స్థానిక ఎంఎల్ఎ పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఏలూరు నుండి జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గంలో ఆడమిల్లి వద్ద ఉన్న చిన్న వంతెన విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నేడు ప్రజలు రాకపోకల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, శిధిలావస్థకు వచ్చిన వంతెనలు, కల్వర్టులు తిరిగి నిర్మించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యాన ప్రజలను సమీకరించి ఎక్కడికక్కడ ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

9న ఆదివాసీ దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం కెఆర్‌పురం ఐటిడిఎలో ప్రాజెక్ట్ ఆఫీసర్ రాములునాయక్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఎల్ఎ బాలరాజుతోపాటు ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, సంస్కృతి, జీవన విధానాలపై సమాజంలో విస్తృత అవగాహన అవసరమన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని సందేశాత్మకంగా, ఆకర్షణీయంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, ఆదివాసీ సంఘాలు సమష్టిగా పని చేయాలని అన్నారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

మార్గదర్శకులేరీ..!



ప్రజాశక్తి - భీమవరం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆర్థికంగా భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పి-4 విధానం క్షేత్రస్థాయిలో ఫలించడం లేదు. పబ్లిక్, ప్రయివేటు పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి-4) లక్ష్యం చేరడం కష్టతరంగా మారింది. జిల్లాలో పి-4కు ప్రణాళిక రూపొందించినప్పటికీ అమలుకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం కలిపి 20 మండలాలు ఉన్నాయి. 535 గ్రామ సచివాలయాలు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం మున్సిపాల్టీలు, ఆకివీడు నగర పంచాయతీ ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 5,17,300 కుటుంబాలు ఉన్నాయి. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పి-4 చేపట్టి మూడు నెలల క్రితం సర్వే పూర్తి చేసింది. ఈ సర్వేలో 64,940 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఉన్నత, సంపన్న వర్గాల్లో పది శాతం మందిని ఎంపిక చేసి వారి సాయంతో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా కార్యాచరణను సిద్ధం చేశారు. జిఎస్‌డబ్ల్యుఎస్ డేటాబేస్, ఇంటింటా సర్వేను ప్రామాణికంగా తీసుకున్నారు. జిల్లాలో 535 సచివాలయాలు ఉండగా 352 సచివాలయాల పరిధిలో 64,940 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించారు. ఈ కుటుంబాల పరిధిలో సుమారు లక్షా 70,803 మంది జనాభా ఉన్నారు. అయితే కేవలం 16,833 కుటుంబాలనే దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులు ముందుకొచ్చారు. మిగిలిన 48,107 బంగారు కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం మార్గదర్శకులను వెతికే పనిలో అధికారులు నిమగ్నమైనప్పటికీ తీసుకున్న లక్ష్యానికి, ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు సమకూర్చిన దాతలకు పొంతన లేకుండాపోయింది. ఒకపక్క జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులతో సమీక్షలు చేస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రావట్లేదు. అధికారులు మార్గదర్శకుల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నప్పటికీ దాతలు ముందుకొచ్చే పరిస్థితి కనిపించట్లేదు. కొంతమందిని బలవంతంగా ఒప్పిస్తున్నారనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. అధికారులు లక్ష్యాన్ని చేరుకోవడానికి నానావస్థలు పడుతున్నారు. అయితే ఇదిలా ఉంటే జిల్లాలో ప్రజాప్రతినిధులు పి-4ను పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రభుత్వం పి-4ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెద్దగా లేదనే విమర్శ ఉంది. జిల్లా అధికార యంత్రాంగం అంతా పి-4పై కుస్తీ పడుతుంటే ప్రజాప్రతినిధులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడట్లేదని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నీరుగారే పరిస్థితి కన్పిస్తోంది.

అధికారుల మెడపై కత్తి..!

పి-4 విజయవంతానికి ప్రత్యేక అధికారులను నియమించారు. 20 మండలాలకు 20 మంది ప్రత్యేక అధికారులను నియమించగా, మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్లకే బాధ్యత అప్పగించారు. ప్రత్యేక అధికారులు బంగారు కుటుంబాల గుర్తింపుతోపాటు మార్గదర్శకుల వివరాల సేకరణకు చర్యలు చేపడుతున్నారు. గ్రామస్థాయి కమిటీలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, స్థానిక రిప్రజెంటేటివ్, స్వయం సహాయక సంఘాల సభ్యురాలు ఉన్నారు. మండలస్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ, మండల వ్యవసాయాధికారి, ఇతర అధికారులతో కమిటీ నియమించారు. అయితే దాతలను ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఏం చేస్తారో, ఎలా చేస్తారో తమకు తెలియదని, దాతలను ఒప్పించి తీరాల్సిందేనని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపధ్యంలో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే నేరుగా అధికారులు, ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని హుకుం జారీ చేసి బలవంతంగా అధికారులను, ఉద్యోగులను ఒప్పించే ప్రయత్నం జిల్లా అధికారులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శులు, మధ్యతరగతి, చిరుద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఒకపక్క కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతుంటే బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒకపక్క విధులు నిర్వహించలేక, మరోపక్క లక్ష్యాలు చేరుకోలేక, ఇంకోపక్క ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు.

బంగారు కుటుంబాలకు దాతలు కరువు

జిల్లావ్యాప్తంగా 64,940 కుటుంబాలు గుర్తింపు

ఇప్పటి వరకు కేవలం 16,833 కుటుంబాలే దత్తత

మిగిలిన 48,107 కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకం

15 నాటికి దత్తత పూర్తి కావాలని ప్రభుత్వ ఆదేశం

ఒత్తిడితో తల్లడిల్లుతున్న అధికారులు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

మరోసారి పి-4 సర్వే..

జిల్లావ్యాప్తంగా 64,904 కుటుంబాలను గుర్తించినప్పటికీ మరోసారి పి-4 సర్వే నిర్వహిస్తున్నారు. బంగారు కుటుంబాల జాబితాలో అనర్హులు ఎవరైనా చేరారా, లేక అర్హులు చేరలేదా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఎంపిక చేసిన బంగారు కుటుంబాల సంఖ్యను వివిధ కారణాలతో తగ్గించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రచారం సాగుతోంది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, గ్రామపెద్దలు, రిటైర్డ్ ఉద్యోగులను గ్రామాలు, పట్టణాలవారీ ఎంపిక చేసి బంగారు కుటుంబాలతో సమావేశాల నిర్వహణకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను మ్యాపింగ్ చేస్తారు. కమిటీ సమావేశాలు ఈ నెల 31లోగా పూర్తి చేసి నూరుశాతం దత్తత పూర్తయ్యేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం జిల్లాలో ఆయా సచివాలయాల వద్ద గ్రామసభలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి కావాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు తీస్తున్నారు.


జారాను అభినందిస్తున్న యాజమాన్యం

రాష్ట్రస్థాయిలో జారా ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని భాష్యం పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఎండి జారా రాష్ట్ర సీనియర్ మహిళా చెస్ టోర్నమెంట్ అండర్-8 విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకుంది. జారా ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ మహమ్మద్ రహల్లా కుమార్తె. ఈ సందర్భంగా జారా తల్లిదండ్రులు మాట్లాడుతూ జారా సాధించిన ఈ గెలుపు తమ కుటుంబానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలో విజయం సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. భాష్యం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, స్నేహితులు ఆమెకు అభినందనలు తెలిపారు. చిన్నవయసులోనే ఆమె చూపించిన క్రమశిక్షణ, పట్టుదల చాలామందికి ప్రేరణ కలిగించేలా ఉందని స్కూల్ యాజమాన్యం తెలిపింది.

మళ్లీ సాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగునీటి కష్టాలు రైతులకు మళ్లీ మొదలయ్యాయి. తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు మండలంలో వర్షం కురిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా రైతులను నీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగునీటి కొరతతో రైతుల నాట్లు వేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముదినేపల్లిలోని పోల్ రాజ్ మురుగు డ్రెయిన్ పరిధిలో సుమారు 200 ఎకరాల పైబడి పొలాల్లో ఇంకా నాట్లు పడలేదు. ఈ భూములకు సాగునీరు అందించే వంటకాలువలో కొందరు రెండు చోట్ల అక్రమంగా పెద్ద తూముల ఏర్పాటు చేయడంతో ఈ భూములకు సాగునీరు అందటం లేదంటూ రైతులు చెబుతున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన తూములను తొలగించాలంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో ముదినేపల్లిలోని నడుందొడ్డి భూములకు సాగునీరు పారడం లేదని కౌలు రైతులు అంటున్నారు. ఈ ఆయకట్టు భూముల కౌలు రైతులు మురుగు కాలువలో ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని మురుగునీరు పొలాలను తోడుకుంటున్నారు. దీంతో మూడు ఎకరాలు తడపడానికి రూ.3,500 ఆయిల్ ఖర్చయినట్లు రైతులు చెబుతున్నారు. ఇంజన్ అద్దె, కూలి కాక ఇంజిన్ ఆయిల్‌కు మాత్రమే అంత ఖర్చయినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నడుందొడ్డి భూములకు సాగునీరు సరఫరా చేసే కాలువలో ఏర్పాటు చేసిన అక్రమ తూములను వెంటనే తొలగించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

హాస్టల్ పున:ప్రారంభానికి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని అమరవరంలో ఉన్న ఎస్‌సి హాస్టల్‌ను పున:ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. హాస్టల్‌ను పున:ప్రారంభించాలని కోరుతూ పూర్వ విద్యార్థులు ఎంఎల్ఎను ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1967లో అప్పటి ఎంఎల్‌సి కీర్తిశేషులు తోటకూరి వెంకటప్పయ్య సహకారంతో స్థాపితమైన హాస్టల్ 2014 వరకు నిర్విరామంగా కొనసాగి ఎందరో విద్యార్థులను ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా చేసిందని చెప్పారు. 2014 నుంచి హాస్టల్ మూసివేయడంతో విద్యార్థులు వసతి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ త్వరలో హాస్టల్‌ను పున:ప్రారంభించేందుకు కృషి చేస్తానని చెప్పారు. వినతిపత్రం అందించినవారిలో రెంటాల వెంకట్, చింతమల్ల కాంతారావు, శనగ వెంకటేశ్వర్లు, తంబళ్ల కన్నయ్య, బుయ్యన నాగేశ్వరరావు, దానియేల్ ఉన్నారు.


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

జీలుగుమిల్లి : నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. పిజిఆర్ఎస్‌లో భాగంగా బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా పలువురి నుంచి సమస్యలతో కూడిన వినతులను స్వీకరించారు. అనంతరం సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా కొడాలి వినోద్ పుట్టినరోజు వేడుక

280 మంది యువకులు రక్తదానం

ప్రజాశక్తి - ముదినేపల్లి


వినోద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పాస్టర్లు

రాష్ట్ర పట్టణాభివృద్ధి సంస్థ డైరెక్టర్, కైకలూరు నియోజకవర్గ కో-కన్వీనర్ కొడాలి వినోద్ పుట్టినరోజు వేడుకలు ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నియోజకవర్గానికి చెందిన 280 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. నియోజవర్గానికి చెందిన పాస్టర్లు పెద్దఎత్తున కొడాలి వినోద్ కార్యాలయానికి వచ్చి వినోద్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వినోద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు, గోపాలపురం, దెందులూరు ఎంఎల్ఎలు బడేటి రాధాకృష్ణయ్య, ఎం.వెంకట్‌రాజు, చింతమనేని ప్రభాకర్, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కైకలూరు ఎఎంసి ఛైర్మన్ త్రినాథ్‌రాజు, గోపాలపురం ఎఎంసి ఛైర్మన్ వై.బ్రహ్మారాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి అభినందనీయం

కలిదిండి : కోటి రూపాయల వ్యయంతో శ్మశానవాటికను అభివృద్ధి చేయడం అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కైకలూరు ఎంఎల్ఎ ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఎన్ఆర్ఐ (అమెరికా) దొంతుబోయిన లెనిన్‌బాబు, నళిని దంపతులు అభివృద్ధి పరచిన స్థానిక శ్మశానవాటికను వారు ప్రారంభించారు. లెనిన్, నళిని దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నున్న రమాదేవి, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు, కంకిపాడు ఎంపిపి నెరుసు రాజ్యలక్ష్మి సతీష్, నీటి సంఘం అధ్యక్షులు ముద్దం భోగేశ్వరరావు, పివి.సత్యనారాయణ, డైరెక్టర్ దొంతుబోయిన విజయ్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

టి.నరసాపురం : సిఎం సహాయ నిధి పేదలకు వరమని జనసేన మండలాధ్యక్షులు అడపా నాగరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో గుండె రాజుకు రూ.75 వేలు, టి.నరసాపురంలో షేక్ మహ్మద్ అల్లి సాహెబ్‌కు రూ.40 వేలు సిఎం సహాయ నిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నవీన్, కంపసాటి రమేష్, పాలేటి సత్తిబాబు, కొరివి శ్రీకాంత్, పబ్బు జయరాజు, పల్లగాని పోతురాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పొగాకు బేళ్ల చోరీపై కేసు

టి.నరసాపురం : పొగాకు బేళ్ల చోరీపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. టి.నరసాపురం గ్రామానికి చెందిన చాత్రాతి యుగంధర్‌కు కృష్ణాపురం గ్రామ శివారులోని 15 ఎకరాల పొలాన్ని భూక్యా భాస్కరరావు కౌలుకు తీసుకుని పొగాకు బ్యారన్ వ్యవసాయం చేశాడు. కృష్ణాపురం గ్రామ శివారులోని ముళ్లపూడి సుబ్బారావుకు చెందిన పొలంలోని షెడ్డు వద్ద 50 పొగాకు బేళ్లు నిల్వ చేశారు. వాటిలో 14 పొగాకు బేళ్లు చోరీకి గురైనట్లు భాస్కరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 48 ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, ఎఎస్‌పి సూర్యచంద్రరావులు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులకు ఏలూరు సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించామని ఎస్‌పి తెలిపారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

నూజివీడు టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో 29 అర్జీలు వచ్చినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

గోదావరిలో చేపల వేట, కలప సేకరణ నిషేధం

ప్రజాశక్తి - పోలవరం

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరద, సున్నితమైన ప్రాజెక్టు ప్రాంతంలో భద్రతా పరిధి దృష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, నది ప్రవాహంలో తేలుతూ కొట్టుకు వచ్చే కలప, దుంగల కోసం నదిలోకి వెళ్లడం పూర్తిగా నిషేధమని పోలవరం ఎస్ఐ ఎస్ఎస్-ఎస్.పవన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు రెయిన్ కోట్లు పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం గరుడ పక్షి నగర్ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా, గౌరవాధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ కార్గిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మాజీ సైనిక ఉద్యోగుల సంఘం వారు అందించిన ఆర్థిక సహకారంతో 40 మంది విద్యార్థులకు రెయిన్ కోట్లు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే క్రమంలో జంగారెడ్డిగూడెం మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కార్యదర్శి డి.సత్యనారాయణ సహకారం హర్షణీయమని కొనియాడారు. దాతలు స్పందించి ప్రభుత్వ పాఠశాలలకు మరింత సహకారం అందించాలని కోరారు.

చెట్లను నరకొద్దని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కామవరపుకోట మండలంలోని కామవరపుకోట, కొండగూడెం వన సంరక్షణ సమితిని పునరుద్ధరించాలని, కొండగూడెం అడవి బంజరులో పేదలు పెంచిన మొక్కలను ఫారెస్ట్ గార్డు నరకడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు జిల్లా అటవీ శాఖాధికారి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, మండల నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫారెస్ట్ గార్డ్ అక్కడ విఎస్ఎస్ లేదని, పేద ప్రజలు పెంచిన మొక్కలను నిర్దాక్షిణ్యంగా నరుకుతున్నారని వారు డిఎఫ్ఒకు తెలిపారు. డిఎఫ్ఒ సతీష్ స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యూరియా కొరత లేదు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి జె.భవాని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారను. మండలంలో రిటైల్ డీలర్ల వద్ద 36.850మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 38.620 మెట్రిక్ టన్నులు వెరశి 74.805 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

డెంగీ, మలేరియా పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

డెంగీ, మలేరియా ఇతర విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టి.నరసాపురం సచివాలయం-2 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.నాగబాబు తెలిపారు. మండలంలోని రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం గ్రామాల్లో మండల వైద్యాధికారి డాక్టర్ కల్పనారాణి ఆదేశాల మేరకు సోమవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవగాహన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

ప్లాస్టిక్‌తో అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పర్యావరణ పరిరక్షణ దిశగా ఒక వినూత్న ప్రస్థానంగా ప్లాస్టిక్ నిషేధంపై చైతన్య కార్యక్రమం ఘనంగా నిర్వహించామని తపస్ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ దాకారపు కృష్ణ తెలిపారు. విద్యార్థులు నాట్య రూపంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే హానికర ప్రభావాలను చూపించారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

తగ్గుతూ... పెరుగుతూ

దోబుచులాడుతున్న గోదావరి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్


పట్టిసీమ వద్ద గోదావరి వరద

మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి వరద ఆదివారం తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతూ ముంపు మండలాల ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. భద్రాచలంలో 34 అడుగులకు తగ్గిన గోదావరి వరద సోమవారం 35.40 అడుగులకు చేరుకుని క్రమంగా పెరుగుతుంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వేలేరుపాడు రూరల్ : రెండు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టినా గోదావరికి వరద తగ్గకపోవడంతో మండల ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. భద్రాచలం వద్ద గోదావరి సోమవారం సాయంత్రానికి 35 అడుగులు దాటి ప్రవహిస్తుండడంతో గోదావరి వరద స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పోలవరం : పోలవరం వద్ద 6,31,303 లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలను జలవనరుల శాఖాధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రానికి పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 10.4 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు.

ఆదివాసీ రైతులకు భూమి కేటాయించాలి

తహాశీల్దార్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్ట్ కారణంగా సర్వం కోల్పోయిన ఆదివాసీ రైతులకు భూమికి బదులు భూమి కేటాయించే ప్రక్రియలో జాప్యం జరుగుతోందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు అన్నారు. ఈ మేరకు తహాశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ స్థానిక రైతులు, అధికారుల కుమ్మక్కు వల్ల ఆదివాసీ రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికి కేటాయించిన భూముల హద్దులు చూపించి అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించకపోతే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడ తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పైదా బోరయ్య, పైడ చినబాబు, కురం దుర్గారావు పాల్గొన్నారు.

తాగునీరందించాలని ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తాగునీరందించాలని కోరుతూ మండలంలోని అచ్చయ్యపాలెంవాసులు ఖాళీ బిందెలతో వాటర్ ట్యాంక్ వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ వారం రోజులుగా ఎస్‌సి దళితపేటలో తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మోటార్ పాడై వారం రోజులవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు వెంటనే మోటార్ బాగు చేసి తాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరువీధుల సూరమ్మ, టి.రాజి, కె.సావిత్రి, కట్లమ్మ, ఎం.గంగమ్మ, ఎం.సుమలత పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో మూడో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ప్రాంగణాల్లో మిగిలిన సీట్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ కోసం 325 మందికి కాల్ లెటర్స్ పంపించగా 196 మంది హాజరయ్యారు. శాప్ ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆచార్య అమరేంద్రకుమార్ మాట్లాడుతూ 30వ తేదీన జరిగే వెయిటింగ్ లిస్ట్ కౌన్సెలింగ్‌తో ఆర్‌జియుకెటిలో మిగిలిన సీట్లన్నీ పూర్తవుతాయని, క్యాంపస్ కల్పించే సౌకర్యాలను వాడుకుని విద్యార్థులు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సోమవారం 184 మంది ప్రవేశం పొందారని తెలిపారు.

ఏజెన్సీలో మెరుగైన వైద్యం అందించాలని ర్యాలీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ మండలాల్లో మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో కోట రామచంద్రపురం ఐటిడిఎ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ కమిటీ నాయకులు తగరం బాబూరావు, కట్టం నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల వల్ల ఏజెన్సీలో ప్రజలు విషజ్వరాల బారినబడి ప్రభుత్వాసుపత్రులను ఆశ్రయిస్తే వైద్య సిబ్బంది వారికి మెరుగైన వైద్యం అందించడం లేదన్నారు. ఆదివాసీ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, దోమల మందు పిచికారీ చేయించాలని, 108 సేవలను అమల్లోకి తీసుకురావాలని కోరారు. స్థానిక ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలని, అన్ని పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటిఐ వద్ద ఉన్న సాయిబాబా ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పిఒ కార్యాలయానికి చేరుకుని పిఒకు వినతిపత్రం అందించారు.

ఫ్యాక్టరీ కార్మికులకు ఉపాధి కల్పించాలని నిరసన

ఏలూరు అర్బన్ : వంగూరు పంచాయతీలోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ లిక్కర్ ఫ్యాక్టరీ కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని కోరుతూ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలు పరిష్కరించాలని, బోనస్, ఇఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు ఇవ్వాలని, కార్మికులందరికీ జీతభత్యాలు పెంచాలని మూడు నెలల నుంచి డిమాండ్ చేస్తున్నా ఇప్పటివరకు మేనేజ్‌మెంట్ చర్చ ల ప్రక్రియ మొదలుపెట్టలేదన్నారు. ధర్నా కార్యక్రమం జరుగుతున్న సమయంలో యాజమాన్యం ఫ్యాక్టరీ గేట్లు మూసివేయడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం గేట్లు తెరిచి కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ యాజమాన్యం గేట్లు తెరవకపోవడంతో మంగళవారం కార్మికులతో చలో డిసిఎల్ కార్యక్రమం చేపట్టి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బెజవాడ పద్మ, అలీసమ్మ, రంగమ్మ, చిన్న రాణి, మోతిభవాని, కోటేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

విద్యార్థులను యు ఆకారంలో కూర్చోబెట్టి బోధించాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులను యు ఆకారంలో కూర్చోబెట్టి బోధిస్తే వారికి చక్కగా అర్థమవుతుందని మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పివిఎస్.రామకృష్ణ అన్నారు. పాఠశాలలో విద్యార్థులను సోమవారం యు ఆకారంలో కూర్చోబెట్టి విద్యాబోధన చేశారు. ఈ విధానం తొలుత కేరళ రాష్ట్రంలోని కొల్లం జిల్లాలో రామవిలాస్ పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. ఈ విధానాన్ని రమణక్కపేట పాఠశాలలో కూడా చేపడు తున్నట్లు తెలిపారు. ఈ విధానంతో ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సిహెచ్.అనురాధ ఉన్నారు.

పలు చోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - దెందులూరు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలంలోని కొత్తూరు, తాళ్లగూడెం, కొత్త ముప్పర్రు గ్రామాల్లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సోమవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఏలూరు సిటీ : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక 27వ డివిజన్‌లో కండ్రికగూడెం సెంటర్‌లో ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి 27వ డివిజన్ ఇన్‌ఛార్జి యడ్లపల్లి శివపాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని ప్రభుత్వ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ కాలనీలో రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆ కాలనీ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాలనీ పక్కనే ఉన్న బ్రాందీ షాపును తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, నాయకులు పంగిడియ్య, కాలనీప్రజలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ఎఐటియుసి ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి సంక్షేమ బోర్డు పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైమ్‌లను వెంటనే పరిష్కరించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం బోర్డు నిధులను తిరిగి చెల్లించాలని, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు అర్బన్ తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది దాటిందని, ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అర్బన్ తహాశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

చింతలపూడి : భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపలి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు చింతలపూడి తహాశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు.

కుక్కునూరు : కుక్కునూరు తహాశీల్దార్ కార్యాలయం ఎదుట చేసిన ధర్నాలో ఎఐటియుసి కుక్కునూరు మండల కన్వీనర్ కొన్నె లక్ష్మయ్య మాట్లాడారు. అనంరతం తహాశీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, భవన నిర్మాణ వర్కర్స్ కుక్కునూరు మండల యూనియన్ అధ్యక్షుడు కుండా సాంబయ్య, కార్యదర్శి దుక్కిపాటి మహేష్ పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : వేలేరుపాడులో నిర్వహించిన ధర్నాలో ఎఐటియుసి మండల కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి సంవత్సరం దాటిందని, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్ యూనియన్ నాయకులు ఎస్‌కె.ఖలీల్, రాజేష్, నాని, కృష్ణ, చంటి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.